
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 33.0 । కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 20 మే 2025


ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న అనూష ప్రాజెక్ట్స్ అధినేత జలంధర్‌రెడ్డి


రుణాల చెక్కును అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# నల్లమలకు రాగానే గుండె ఉప్పొంగుతోంది..

## నల్లమల బిడ్డగా సీఎం పీఠాన్ని అధిరోహించడం గర్వంగా భావిస్తున్నా

- అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశంలోనే రోల్ మోడల్‌గా చేస్తా
- అమ్రాబాద్ మండలం మాచారం సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి
- ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభం


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/అచ్చంపేట/అమ్రాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): 'నల్లమల బిడ్డగా ఈ ప్రాంతానికి రాగానే నా గుండె ఉద్వేగానికి లోనవుతోంది. జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాప్‌రెడ్డి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి, మాజీ మంత్రి మహేంద్రనాథ్ వంటి మహోన్నతమైన వారు ప్రాతినిధ్యం వహించారు. నల్లమల బిడ్డగా నేను సీఎం కావడం గర్వంగా భావిస్తున్నా'నని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని సీఎం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి నల్లమలతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు వెన్నుదన్నుగా నిలిచిన చరిత్ర ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు భూమి, భుక్తి దక్కిందంటే కాంగ్రెస్ వల్లనే సాధ్యమైందని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంపై తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని అన్నారు. చెంచులు, గిరిజనుల జీవితాలలో విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు నియోజకవర్గాన్ని దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యతను తనభుజస్కంధాలపై వేసుకుంటున్నానని అన్నారు. మళ్లీ వచ్చే ఏడాది మే 19న మాచారానికి వస్తానని, అప్పటి వరకు వెనుకబడిన వర్గాలు కూడా ఆర్థికంగా బలపడేలా చేయూత అందించాలని అధికార యంత్రాంగానికి చెప్పారు. నల్లమలలోని అన్ని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, నివేదికను రూపొందించాలని అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతులకు సోలార్ పంపు సెట్లు అందించాలని చెప్పారు. 100 రోజుల్లో ప్రణాళికను పూర్తి చేయాలని, 100 శాతం సబ్సిడీపై నిధులు మంజూరు చేసే బాధ్యతను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు అప్పగించారు. ఐటీడీఏకు ఐఏఎస్ అధికారిని నియమించే విషయమై మంత్రి సీతక్క క్లారిటీ ఇచ్చారు.

### నల్లమల డిక్లరేషన్‌ను పాటిస్తాం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నల్లమల డిక్లరేషన్‌ను తూచ తప్పకుండా నాలుగేళ్లలో పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. గిరిజన యువతకు జూన్ 2న రూ.1,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించిన ఈ రోజు భారత దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన సుదినమన్నారు. వజ్రంలాంటి ముఖ్యమంత్రి, వజ్రాల్లాంటి మంత్రుల హృదయ అంతరాల్లో నుంచి ఈ పథకం ఉద్భవించిందన్నారు.

ఈ రోజు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెచ్చిన నల్లమల డిక్లరేషన్‌తో రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి వంటి నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. రాష్ట్రం

(మిగతా 6లో..)


కొండారెడ్డిపల్లిలో సీఎం వాహనంపై పూలు చల్లుతున్న కార్యకర్తలు


మాచారంలో బహిరంగ సభకు హాజరైన ప్రజలు

### నల్లమలలో ఎదిగి.. ఒదిగి సీఎం అయ్యారు : మంత్రి సీతక్క



నల్లమల ప్రాంతంలో పుట్టి, ఎదిగిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి, ప్రజల కోసం ఒదిగి పాలన అందిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. ఆదిమ జాతులకు ప్రత్యేక చట్టాలను చేయడం జరిగిందన్నారు. భూసంరక్షణ చట్టాలు ఎన్ని ఉన్నా గత ప్రభుత్వంలో ఆదిమ జాతి ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. నల్లమలలో పుట్టిన రేవంత్ రెడ్డికి ఈ ప్రాంత సమస్యలు తెలుసు కాబట్టి, వారి అభివృద్ధి కోసం ఎంత ఖర్చయినా ఈ ప్రభుత్వం భరిస్తుందన్నారు. గతంలో ఐటీడీఏలో ఎన్నో శాఖలు ఉన్నా ప్రస్తుతం 3, 4 శాఖలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. 15 సంవత్సరాలు నిండిన చెంచు యువతులు మహిళా సంఘాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో వడ్డీ వ్యాపారుల దోపిడీ అధికంగా ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో 60 లక్షల మహిళా సంఘాలు ఉన్నాయని మంత్రి చెప్పారు.

### రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారు: మంత్రి జూపల్లి కృష్ణారావు



గత పాలకులు రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల్లోకి నెడితే తాము అవి తీర్చుకుంటూ, 16 మాసాల ఎన్నో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ప్రజా సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### మినిట్ టు మినిట్

అచ్చంపేట (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ఉదయం 11:55 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్‌లో అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చేరుకున్నారు.

- 12 గంటలకు మంత్రులతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకించారు.
- 12:05కు ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం పైలాన్‌ను ఆవిష్కరించారు.
- 12:08కి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి బటన్ నొక్కి సోలార్ మోటార్లను ప్రారంభించారు.
- 12:17కు చెంచు రైతుల ముఖాముఖిలో పాల్గొన్నారు.
- 12:45కు మాచారం గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- 1.05కు సభ వేదికకు చేరుకున్నారు.
- 2.45కు రోడ్డు మార్గంలో కొండారెడ్డిపల్లికి బయల్దేరారు.


కాన్వాయ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి

## రోడ్డుపై బైఠాయించిన మహిళా రైతు

- పొలంలోకి రానివ్వడం లేదని ఆవేదన
- పిల్లలతో కలిసి ఆందోళన

6

## అయిజలో ఐపీ కలకలం

- రూ. కోటి అప్పుచేసిన వడ్డీ వ్యాపారి
- 44 మందికి అందిన నోటీసులు

7

## నేటి నుంచి రెండో విడత శిక్షణ

- ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 7,500 మంది ఉపాధ్యాయులు
- స్కూల్ అసిస్టెంట్స్‌కు జిల్లా కేంద్రాల్లో, ఎస్‌జీటీలకు మండల కేంద్రాల్లో..

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుకోసం పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు ఇవ్వనున్న వేసవి రెండో విడత శిక్షణ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. స్కూల్ అసిస్టెంట్లకు మూడు విడతల్లో, ఎస్‌జీటీలకు ఒక విడతలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. స్కూల్ అసిస్టెంట్లకు ఇప్పటికే మొదటి విడత ఈనెల 13 నుంచి 17 వరకు పూర్తయ్యింది. రెండో విడత శిక్షణకు పాఠశాల జిల్లా విద్యాశాఖ, అకడమిక్ మానిటరింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కొనసాగనుంది. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయుల హాజరు ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటారు. డుమ్మా కొట్టకుండా శిక్షణ కేంద్రాల్లో జియోట్యాగింగ్ ఏర్పాటు చేశారు. ఎస్‌జీటీలకు కూడా మండల కేంద్రాల్లో నేటి నుంచి శిక్షణ ప్రారంభం కానుంది.

### 3,227 ప్రభుత్వ పాఠశాలలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలల్లో 12,854 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో 2,760 మందికి మొదటి విడతలో శిక్షణ ఇచ్చారు. రెండో విడతలో స్కూల్ అసిస్టెంట్స్ తోపాటు ఎస్‌జీటీలకు కూడా శిక్షణ ఇస్తున్నారు. 7,500పైగా ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఇచ్చే శిక్షణకు మహబూబ్‌నగర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మెరజుల్లా ఖాన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ అబ్జర్వర్‌గా ఉండగా, ఆయా జిల్లాల కలెక్టర్లు పరిశీలించనున్నారు. విద్యాశాఖ అధికారులు, ఏఎంవోలు, సీఎంవోలు నిత్యం శిక్షణ కేంద్రాలలో ఉంటూ పర్యవేక్షించనున్నారు.

### పాలమూరులో..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల జేపీఎన్ఎస్ కళాశాలలో మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు రెండో విడత శిక్షణ ఇవ్వనున్నారు. స్కూల్ అసిస్టెంట్స్ 830 మంది శిక్షణకు హాజరు కానున్నారు. ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, గణితం, భౌతిక, జీవ శాస్త్రం, తెలుగు, హిందీ సబ్జెక్టుల వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలోని 17 మండలాల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 1700 మందికి జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో ఏర్పాటు చేసిన 10 కేంద్రాలలో శిక్షణ ఇవ్వనుండగా, జడ్చర్ల, రాజాపూర్, మిడ్జిల్, బాలానగర్, గండీడ్, భూత్పూర్ మండలాలకు సంబంధించి మండల కేంద్రాల్లోనే ఎమ్మార్సీలు శిక్షణ ఇవ్వనున్నారు. ఇక్కడ మండల విద్యాశాఖ అధికారులు ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మే 22వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐడీవోసీలోని ప్రజావాణి హాల్లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరానికి సంబంధించి 3631 మంది విద్యార్థులు, రెండవ సంవత్స రానికి సంబంధించి 2092 మంది విద్యార్థులు మొత్తంగా 5723 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. ఇందుకోసం 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్, సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద మౌలిక వసతులతో పాటు ప్రథమ చికిత్స కిట్లతో ఏఎన్ఎం ఆశా వర్కర్లను నియమించాలని వైద్య అధికారిని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గద్వాల జిల్లాలో భారీ వర్షం

- పిడుగు పాటుతో రెండు ఎద్దులు మృతి
- ఇద్దరు గొర్రెల కాపరులకు గాయాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం


మల్దకల్ మండలం మద్దెలబండలో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దులు

7



బహిరంగ సభలో మహిళల ఉత్సాహం



మాచారంలో నృత్యం చేస్తున్న గిరిజనులు



కొండారెడ్డిపల్లిలోని ఆలయంలో రేవంత్‌రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

# నల్లమలకు రాగానే గుండె ఉప్పొంగుతోంది

( 5వ పేజీ తరువాయి )

అభివృద్ధి చెందవద్దని, ప్రజలకు పథకాలు అందవద్దని ప్రతిపక్షాలు ఏదో ఒక కుట్ర చేస్తున్నాయన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఉమ్మడి కుంటుబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించబోతున్నామన్నారు. ప్రతీ పాఠశాలను 25 ఎకరాలలో రూ.200 కోట్లతో నిర్మించనున్నామమన్నారు. అందుకోసం మొదటి దశలోనే 104 పాఠశాలలకు రూ.11,600 కోట్లు మంజూరు చేశామన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం పెంచామన్నారు.

కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, అనిరుధ్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం వస్తున్న హెలికాప్టర్‌ను చూసి ఈలలు వేస్తున్న జనం

## వారిని కాపాడుకునేదే కాంగ్రెస్ ప్రభుత్వం: మంత్రి దామోదర రాజనరసింహ



రాష్ట్రంలో ఉన్న దళితులను, ఆదిమ జాతులను కాపాడుకునేదే కాంగ్రెస్ ప్రభుత్వమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. వారి హక్కులను రక్షించేది కూడా కాంగ్రెస్సేనన్నారు. ఇందిరమ్మ పాలనలో 25 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిందన్నారు. గత ప్రభుత్వం ధరణి తెచ్చి, పేదవాడి భూములను కొల్లగొట్టిందన్నారు. 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు సూచనల మేరకు తమ ప్రభుత్వమే మొదటిసారిగా అమలు చేసిందన్నారు.

## పోలీసుల చేత కొట్టించిన భూమిలోనే సోలార్ మోటార్లు పెట్టించాం: ఎంపీ మల్లు రవి



గత ప్రభుత్వ పాలనలో పోడు భూములను సాగు చేసిన రైతులను చెట్టుకు కట్టేసి కొట్టించారని, ఆ భూములోనే ప్రజా పాలన ప్రభుత్వం సోలార్ మోటార్లు పెట్టిందన్నారు. మీ కోసం పనిచేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే అది ఒర్వలేక ఏదో ఒకటి రాద్ధాతం సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ సూచించారు.

## పర్యాటక అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ



దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో సాగునీరు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అప్పార్ ప్లాట్ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సభలో ఆయన సీఎంకు విన్నవించారు. మద్దిమడుగు వద్ద వంతెన నిర్మాణంతో పాటు నల్లమల్లలో పర్యాటక అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. మన్ననూర్ ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను, పూర్తి స్థాయిలో కార్యాలయ సిబ్బందిని నియమించాలన్నారు. నియోజకవర్గంలో పేదప్రజలు అధికంగా ఉన్నందున మరో 100 ఇందిరమ్మ ఇళ్లు అదనంగా మంజూరు చేయాలని, అమ్రాబాద్ మండలంలో 220/33 విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేయాలని, బీకే తిర్మాలాపూర్, బీకే లక్ష్మాపూర్ గ్రామాలలో రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఆర్ఎఫ్ఓఆర్ ద్వారా పట్టాలు ఇప్పించాలని కోరారు. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# మహిళా సంఘాల డబ్బు మాయం

» కలెక్టర్‌కు రాంపూర్ మహిళల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రాంపూర్ గ్రామ మహిళలు

కోయిలకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు తాము ప్రతీ నెల చెల్లించిన డబ్బు బ్యాంకులో జమ కాలేదని మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్ కలెక్టర్ విజయేందిర బోయికి ఫిర్యాదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గోల్డెన్, శ్రీ విష్ణు, వెన్నెల, తాజ్‌మహల్, సూర్యలక్ష్మి, ఆదర్శ మహిళ సంఘాల సభ్యులు రుణాలు తీసుకొని ప్రతీ నెల ఐకేపీ బుక్ కీపర్‌కు డబ్బు చెల్లించారు. కానీ ఆ డబ్బు బ్యాంకులో జమ కాలేదు. ఇటీవల సంఘాల సభ్యులు రుణం కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)కు వెళ్లగా గతంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేదని తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన వారు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై విచారణ చేపట్టి, నివేదిక అందించాలని డీఆర్‌డీవో, డీపీఎంలను ఆదేశించారు.

# రోడ్డుపై బైఠాయించిన మహిళా రైతు

» పొలంలోకి రానివ్వడం లేదని ఆవేదన

» పిల్లలతో కలిసి ఆందోళన



గట్టు పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని రోడ్డుపై బైఠాయించిన మహిళా రైతు రాణి

గట్టు, మే 19 (ఆంధ్రజ్యోతి) : తన భర్త ద్వారా సంక్రమించిన పొలంలోకి తనను రానివ్వకుండా తన మరిది అడ్డుకుంటున్నాడని ఓ మహిళ రోడ్డుపై బైఠాయించిన ఘటన సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. మండలంలోని. ఆలూరు గ్రామానికి చెందిన భర్త సవారన్న మృతి చెందగా విరాసత్ ద్వారా 183/డీ1, 188/డీ1, 184/.జీ లోని సర్వే నంబర్లలో 1.32 ఎకరాల భూమి భార్య రాణి పేర వచ్చింది. అయితే మరిది మల్లేష్ ఈ వ్యవసాయ భూమిలోకి రానివ్వకుండా వ్యవసాయం చేసుకోకుండా అడ్డుపడుతూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అమె అవేదన వ్యక్తంచేసింది. మరిదిపై అధికారులు, పోలీసులను ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని అమె అరోపించారు. చివరకు తన పిల్లలతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని రోడ్డుపై తన పిల్లలతో కలసి బైఠాయించింది. న్యాయం చేసేవరకు తాను ఇక్కడి నుంచి కదలబోమని బీష్మించుకొని కూర్చున్నది. చివరికి పోలీసుల హామీ మేరకు అమె ఆందోళన విరమించారు.

# దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

గద్వాల న్యూటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఐకేపీ సెంటర్లలో దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆందోళన నిర్వహించారు. గద్వాల మండల పరిధిలోని అనంతపురం గ్రామ ఐకేపీ కేంద్రంలో దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయడం లేదని చేపట్టిన ఆందోళనలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. దొడ్డు రకం ధాన్యాన్ని మిల్లర్లు లారీల నుంచి దించుకోవడం లేదన్నారు. అందువల్ల గ్రామ రైతులు వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్నారని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీంతో పాటు తడిచిన ధాన్యం కూడా తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గోపాల్, గోవిందు, రామకృష్ణ, వేమారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే సమస్యలకు చెక్

» త్వరలోనే లైసెన్స్‌డ్ సర్వేయర్లు

» ఉమ్మడి జిల్లాలో 1,449 దరఖాస్తులు

నారాయణపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో భూ సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. గతంలో ధరణి పోర్టల్‌తో తలెత్తిన భూ సమస్యల కోసం రైతులు సర్వేయర్ల కోసం నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. దరఖాస్తు చేసుకొని నెలలు గడిచినా సర్వే కాని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియమకంపై దృష్టి సారించింది. ప్రైవేట్ సర్వేయర్లలతో పాటు, అసక్తి, అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,449 మంది దరఖాస్తు చేసుకున్నారు. నారాయణపేట జిల్లాలో 219 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంపికైన వారికి మూడు విడుతల్లో శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ, టిప్పణ్ ప్లానింగ్, క్షేత్ర స్థాయి పనిపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత 40 రోజుల పాటు మండల సర్వేయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఫైనల్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా లైసెన్సులు జారీ చేస్తారు. దీంతో వారికి సర్వేయర్లుగా అధికారిక గుర్తింపు లభించనున్నది.

**ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు**


| జిల్లా | ఓసీ | బీసీ | ఎస్సీ | ఎస్టీ | దరఖాస్తులు |
|---|---|---|---|---|---|
| మహబుబ్‌నగర్ | 12 | 164 | 47 | 45 | 268 |
| జోగులాంబగద్వాల | 11 | 169 | 102 | 03 | 285 |
| నాగర్‌కర్నూల్ | 9 | 226 | 144 | 78 | 457 |
| నారాయణపేట | 13 | 152 | 45 | 9 | 219 |
| వనపర్తి | 9 | 139 | 50 | 22 | 220 |
| మొత్తం | 54 | 850 | 388 | 157 | 1449 |

నారాయణపేట జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ గిరిధర్‌తో పాటు ఇద్దరు ప్రభుత్వ సర్వేయర్లు, ఒక డిప్యూటీ సర్వేయర్ ఉన్నారు. మరో అరుగురు ఐకేపీ సర్వేయర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో 13 మండలాలు ఉండగా, ఉన్న సర్వేయర్లకే మండలాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో దాదాపు 200 మంది రైతులకు సంబంధించిన సర్వే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి 20 గ్రామాల్లో 600 ఎకరాల్లో సర్వేపూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఇంకా ఊట్కూర్ పెద్దచెరువు, పేరపళ్ల జాయమ్మచెరువు, కాన్‌కుర్తి చెరువుతో పాటు 1500 ఎకరాల సర్వే నిర్వహించాల్సి ఉంది.

## తగ్గిన ఎండలు

వనపర్తి/నారాయణపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం ఎండల తీవ్రత కాస్త తగ్గింది. వనపర్తి జిల్లాలోని గోపాల్‌పేట మండలంలో అత్యధికంగా 38.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దయింది. అత్యల్పంగా వనపర్తిలో 24.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 36.1, కనిష్ఠం 27 డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 35, కనిష్ఠం 24.8 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 33 డిగ్రీలు, కనిష్ఠం 25 డిగ్రీలు, నారాయణపేట జిల్లా గరిష్ఠంగా 33 డిగ్రీలు, కనిష్ఠంగా 25 డిగ్రీలు నమోదైంది.

## వివాహిత అనుమానాస్పద మృతి



పూజ (ఫైల్)

కొత్తపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : పెళ్లయిన నెల రోజులకే ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలం, ఎక్కమేడు గ్రామంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం మల్కాపూరం గ్రామానికి చెందిన కుశలయ్య కుమార్తె పూజ(19)కు ఎక్కమేడు గ్రామానికి చెందిన కడపని స్వామి (23)తో గత నెల 20న వివాహం అయ్యింది. ఆదివారం రాత్రి భోజనం తర్వాత వారిద్దరూ మిద్దెపైనున్న గదిలో నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత ఆమె చనిపోయినట్లు స్వామి తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ విషయాన్ని సోమవారం తెల్లవారుజామున పూజ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు గ్రామానికి చేరుకున్నారు. ఆమె మృతిపై అనుమానం ఉందని పేర్కొంటూ తండ్రి కుశలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూజ మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

# సైనికులకు అండగా నిలుద్దాం

» పాలమూరు ఎంపీ డీకే అరుణ

» మహబూబ్‌నగర్ పట్టణంలో తిరంగా ర్యాలీ



గడియారం చౌరస్తాకు చేరుకున్న మహిళల తిరంగా ర్యాలీ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది మంది భారతీయులకు రక్షణగా నిలిచిన సైనికులకు అండగా ఉందామని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సందూర్ విజయవంతమైన సందర్భంగా సైనికులకు సంఘీభావంగా సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళలు, యువతులు జాతీయ జెండాలను చేతబట్టి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ జయహో అంటూ నినాదాలు చేశారు. పాత లైబ్రరీ నుంచి ప్రారంభమైన ర్యాలీ రామ్‌నగర్ మీదుగా గడియారం చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైనికులు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందన్నారు. ఉగ్రవాదులను అంతం చేసేవరకు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారన్నారు. ఇలాంటి ఉగ్రదాడులను ప్రతీ భారతీయుడు ఖండించాలని కోరారు. తిరంగా ర్యాలీలో బీజేపీ హైదరాబాద్ పట్టణ ఉపాధ్యక్షురాలు కీర్తి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మజా రెడ్డి, జయశ్రీ, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

# ఉరకలేస్తున్న ఉత్సాహం

## వేసవి కబడ్డీ శిక్షణలో క్రీడాకారుల చురుకుదనం



వేసవి శిక్షణ శిబిరంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతకుమార్(ఫైల్)



స్టేడియంలో మొదటిసారి మ్యాట్‌పై సాధన చేస్తున్న కబడ్డీ క్రీడాకారులు(ఫైల్)

● మ్యాట్‌పై ప్రత్యేక సాధన

● ఉదయం, సాయంత్రం స్టేడియంలో పోటీలు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాలతో మైదానాలు, అకాడమీలు, ఇండోర్ స్టేడియాలు కళకళ లాడుతున్నాయి. క్రీడాశాఖ అధికారులు జిల్లాలో 30పైగా వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జిల్లా క్రీడాశాఖ సహకారంతో జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఔత్సాహిక గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. క్రీడాశాఖ క్రీడాకారులకు వసతి కల్పించడంతో పాటు కబడ్డీ సంఘం క్రీడాకారులు ఇక్కడ భోజన వసతి కల్పించింది. మ్యాట్‌లపై శిక్షణ అందజేస్తుండటంతో క్రీడాకారుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదు. ఉదయం, సాయంత్రం నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ కబడ్డీ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉండి ప్రోత్సహిస్తున్నారు. నెలాఖరు వరకు కొనసాగే ఈ క్యాంపుల్లో కబడ్డీ శిక్ష ణ ఇస్తూ మెలకువలు నేర్పుతుండటంతో ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వ స్తున్నారు. ఇప్పటికే పలువురు గ్రామీణ క్రీడాకారులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

### ప్రో-కబడ్డీ ఆడుతా..



వేసవి శిబిరంలో మ్యాట్‌పై శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది. ఉదయం, సాయంత్రం కోచ్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. వసతి, భోజనం ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయి టోర్నీ ఆడాను. ప్రో-కబడ్డీ ఆడాలని ఉంది.

- మణికంఠ, బాలానగర్


### జాతీయ స్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం...



కబడ్డీ అంటే చాలా ఇష్టం. మొదటిసారి వేసవి శిబిరానికి వచ్చి శిక్షణ తీసుకుంటున్నాను. కురుమూర్తి సార్, కోచ్ ఆటలో మెలకువలు నేర్పుతున్నారు. జిల్లా స్థాయిలో ఆడాను. భవిష్యత్తు భారత జట్టుకు ఆడాలన్నదే నా లక్ష్యం.

-ముఖేష్, జడ్చర్ల

### ప్రో కబడ్డీ ఆడాలని ఉంది...



జిల్లా క్రీడాశాఖ, కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వేసవి శిబిరాలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. కబడ్డీ సంఘం కృషి వల్లే రాష్ట్ర స్థాయి పోటీలకు అవకాశం లభించింది. ప్రోకబడ్డీ ఆడాలని ఉంది.

- హర్షవర్ధన్, గాజులపేట

### క్రీడాభివృద్ధికి నా వంతు కృషి చేస్తా..



జిల్లాలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తాను.. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నదే నా ఆకాంక్ష. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదు. వేసవి శిబిరాల్లో క్రీడాకారులు తమ ప్రతిభ చాటాలి. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటా.

- శాంతకుమార్,
జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు

### వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి...



జిల్లా క్రీడాశాఖ, కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. కబడ్డీ క్రీడాభివృద్ధికి శాంతికుమార్ సహకారంతో ఎంతో ఉంది. అందరి సహకారంతో కబడ్డీ క్రీడాభివృద్ధి మరింత కృషి చేస్తాం.

- కురుమూర్తిగౌడ్,
జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ

### జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదు..



జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదు. ప్రతీ క్రీడా అంశంలో క్రీడాకారులు జాతీయస్థాయిలో ఎదిగారు. కబడ్డీలో జిల్లా క్రీడాకారులు మరింత రాణించాలి. గ్రామీణ క్రీడాకారులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటాలి. కబడ్డీ క్రీడాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తాం.

- టీ శ్రీధర్‌రెడ్డి,
జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు

క్రైం కార్నర్

## ఆర్టీసీ బస్సు బోల్తా

» ముగ్గురికి స్వల్ప గాయాలు



పాలెం సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి కిందకు బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

కొత్తకోట, మే 19 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం, పాలెం గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప నుంచి హైదారాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు పాలెం గ్రామ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై నుంచి కిందకు బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వారు సురక్షితంగా బయట పడ్డారు. ప్రమాద సమాచారం తెలియగానే పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ప్రమాదం తీరును చూసి ఎంత మంది క్షతగాత్రులు ఉన్నారోనని ఆందోళన చెంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయితే బస్సులో నుంచి ప్రయాణికులు ఒక్కొక్కరుగా సురక్షితంగా బయటకు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పంగా గాయపడిన ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేయనున్నట్టు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వంగూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, డిండి మండలం, తవక్లాపూర్ తండాకు చెందిన భద్య (40) అనే వ్యక్తి నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని తిప్పారెడ్డిపల్లి గేటు సమీపంలో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

## భీమా నదిలో కొనసాగుతున్న గాలింపు

» లభించని రైతు తిప్పన్న ఆచూకీ



భీమా నదిలో గాలింపు చర్యలు చేపట్టిన జాలర్లు

కృష్ణ, మే 19 (ఆంధ్రజ్యోతి) : భీమా నదిలో మొసలి లాక్కెళ్లిన రైతు తిప్పన్న కోసం మూడు రోజులుగా గాలింపు కొనసాగుతోందని నారాయణపేట జిల్లా, మక్తల్ సీఐ రామ్‌లాల్ తెలిపారు. పుట్టీలు, గజ ఈతగాళ్ల సాయంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నదిలో గాలించినా ఫలితం లేకపోయింది. ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్ రెడ్డి, ఎఫ్ఆర్ఐ సలీముద్దీన్, మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, ఏఎస్ఐ సురేంద్ర బాబు పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజుల భర్త ఆచూకీ లభించలేదని భార్య తిమ్మవ్వ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

## ధాన్యం లారీల పట్టివేత



పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ధాన్యం లోడు లారీలు

కృష్ణ, మే 19 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక నుంచి ధాన్యం లోడ్‌తో వస్తున్న మూడు లారీలు, ఒక డీసీఎంను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ గురురాజ్ రావ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, దావణగేరి జిల్లా నుంచి ధాన్యం లోడుతో మూడు లారీలు, ఒక డీసీఎం వస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు ఆదివారం రాత్రి నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు శివారులో, 167 జాతీయ రహదారిపై ఉన్న చెక్ పోస్టు వద్ద కాపు కాసి వాహనాలను పట్టుకున్నారు. ధాన్యం తరలింపునకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు గురురాజ్, బాలరాజు తెలిపారు.




# రైతులందరికీ.. గుర్తింపు కార్డులు

## ఐడీ కార్డులున్న వారికే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఆత్మకూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : చిన్న, పెద్ద కంపెనీల్లో పని చేసే వారికి, ప్రభుత్వ ఉద్యోగులందరికీ గుర్తింపు కార్డులుంటాయి. కానీ దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం ఏ గుర్తింపు లేకుండా పోయింది. అందుకే ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ కార్డు) ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో వివరాలు నమోదు చేసుకొని గుర్తింపు కార్డు తీసుకోవాలని సూచిస్తోంది. గుర్తింపు కార్డులున్న రైతులకే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని చెప్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా పాస్‌బుక్ ఉన్న రైతులందరికీ ఏడాదికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. పథకాన్ని వర్తింప చేసేందుకు రైతులందరూ గుర్తింపు పొంది ఉండాలని సూచిస్తోంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు.

### మరిన్ని సంక్షేమ పథకాలు

రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కిసాన్ సమ్మాన్ యోజనతో పాటు, ఫసల్ బీమా యోజన, సబ్సిడీపై ఎరువులు, విత్తనాల పంపిణీ, జల సమృద్ధి యోజన తదితర పథకాలను అమలు చేస్తోంది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ఫార్మర్ ఐడీ కార్డులు అందించాలని నిర్ణయించింది. అందుకోసం రైతులందరూ గుర్తింపు పొందాలని సూచిస్తోంది. అందుకోసం రైతులు పట్టాదారు పాస్ బుక్, ఖాతా, ఆధార్ కార్డులకు సంబంధించిన కాపీలతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తే, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు భరోసా, రైతు బీమా, బోనస్ వంటి పథకాలు వర్తించవేమో అని రైతులు అపోహలకు గురవుతున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధం ఉండదని, గుర్తింపు పొందిన ప్రతీ రైతుకు కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు అధికారులు చెప్తున్నారు.

### జిల్లాలో 2.80 లక్షల సాగు భూమి

వనపర్తి జిల్లా వ్యాప్తంగా 2.80 లక్షల ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన కిసాన్ సమ్మాన్, రైతు భరోసా తదితర పథకాల వర్తింపు లెక్కల ప్రకారం 1.90 లక్షల మంది రైతులు పట్టాదారు పాస్‌బుక్ కలిగి ఉన్నారు. కానీ ఇప్పటి వరకు మండలాల వారీగా పదుల సంఖ్యలోనే రైతులు గుర్తింపు పొందారు. మరో రెండు వారాల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. దీంతో రైతులందరూ గుర్తింపు పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాల్సి ఉంది. ఆత్మకూరు మండలంలోని జూరాల, మూలమల్ల, ఆరేపల్లి క్లస్టర్లలో ఇప్పటివరకు 500 మంది కిపైగా రైతులు గుర్తింపు పొందినట్లు వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. రైతులందరూ వివరాలు సమర్పించి గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### వెంటనే ఐడీ కార్డు తీసుకుంటా



కేంద్ర ప్రభుత్వం రైతులను గుర్తిస్తూ ఫార్మర్ ఐడీ కార్డులు ఇవ్వడం శుభపరిణామం. ఇప్పటికే కిసాన్ సమ్మాన్ యోజన వర్తిస్తోంది. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న మరిన్ని సంక్షేమ పథకాల కోసం గుర్తింపు కార్డు ఉపయోగపడుతుంది. అందుకోసం నేను వెంటనే గుర్తింపు కార్డు తీసుకుంటాను.

\- కుమార్, రైతు, జూరాల

### రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రతీ ఒక్కరు ఫార్మర్ ఐడీ కార్డులు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాం. మరోసారి సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. ఫార్మర్ ఐడీ కార్డు ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి. అందుకే రైతులందరూ మొబైల్ నెంబర్ జతపరిచిన ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలి.

\- వినయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, ఆత్మకూరు

# గద్వాల జిల్లాలో భారీ వర్షం

» పిడుగు పాటుతో రెండు ఎద్దులు మృతి

» ఇద్దరు గొర్రెల కాపరులకు గాయాలు

» కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



రాజోలి మండలం మాన్‌దొడ్డిలో వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పిన రైతులు

గద్వాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మల్దకల్ మండలం మద్దెల బండలో పిడుగు పడి రెండు ఎద్దులు చనిపోయాయి. ఇద్దరు గొర్రెల కాపరులు గాయపడ్డారు. జిల్లాలోని మాన్‌దొడ్డి, రాజోలి, వెంకంపేట, కేటీదొడ్డి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొంత మేర తడిసిపోయింది. దీంతో ధాన్యం కాంటా చేయొద్దని మిల్లర్లు హుకుం జారీ చేయడంతో కొనుగోలుళ్లు నిలిచిపోయాయి. కానీ ఇప్పటికే కాంటా వేసిన ధాన్యాన్ని లారీల్లో తరలిస్తున్నారు. అయితే గన్నీ బ్యాగులు, లారీల కొరతతో కొనుగోలు చేయకపోవడం వల్లే ధాన్యం తడిసిపోయిందని మల్దకల్ మండల కేంద్రంలో రైతులు ధర్నా చేశారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### జిల్లాలో 5.46 సెంటీమీటర్ల వర్షం

జిల్లాలో అయిజలో 54.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రోడ్లు, వాగులు, వంకల్లో కొంత మేర నీళ్లు చేరాయి. మానవపాడులో 53, రాజోలిలో 48.4, కేటీదొడ్డిలో 38.6, వడ్డేపల్లిలో 34.2, గద్వాలలో 29.6, ఇటిక్యాలలో 23.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మల్దకల్, గట్టులో చిన్నపాటి వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. మల్దకల్ మండలం మద్దెల బండకు చెందిన సౌటిబావి నర్సింహులు పొలంలో కట్టేసి ఉన్న రెండు ఎద్దులు పిడుగుపాటుతో మృతి చెందాయి. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. అయిజకు చెందిన గొర్రెల కాపరులు రమేశ్, సురేశ్‌లు గొర్రెలను మేపేందుకు మాన్‌దొడ్డి ప్రాంతానికి వెళ్లగా పిడుగుపడి గాయపడ్డారు. వారిని చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. మానవపాడులో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. చెన్నిపాడులో రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. గద్వాల పట్టణంలో రోడ్లు జలమయం అయ్యాయి. రాఘవేంద్ర కాలనీ నుంచి వచ్చే మురుగునీళ్లు రాయిచూర్ రోడ్డుపై పారాయి. పెద్ద అగ్రహారంలో ఒక ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. అందులో నివసిస్తున్న వారికి త్రుటిలో ప్రమాదం తప్పింది.

# క్రీడలతో జాతీయ సమైక్యత

» మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్

» ముగిసిన ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు

» విజేత జట్టుకు రూ.50 వేలు, ట్రోఫీ అందజేత



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జడ్చర్ల జట్టుకు ట్రోఫీ, నగదు అందిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్

బిజినేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో జాతీయ సమైక్యతా భావన సాధ్యం అవుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లా మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వారం రోజుల పాటు కొనసాగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో 40 జట్టు పాల్గొన్నాయి. పోటీల్లో విజేతగా నిలిచిన జడ్చర్ల జట్టుకు రూ.50 వేలు, ట్రోఫీ, పతకాలు అందించారు. రన్నర్‌గా నిలిచిన గుమ్మకొండ జట్టుకు రూ.25 వేలు, ట్రోఫీ, పతకాలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ తదితర ప్రోత్సాహక బహుమతులను అందించారు. నిర్వాహకులు నరేందర్ గౌడ్, అజీమ్, ఊర్కొండ రఘుబాబు, అనిల్ గౌడ్, నవీన్, బొడ్డు ఈశ్వర్, శివలను అభినందించారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి అంజనేయులు, మాజీ సర్పంచ్ ముడావత్ రామునాయక్, వేముల సత్యం, సత్యశీల సాగర్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రక్షణ నిధికి రూ. లక్ష విరాళం

» విశ్రాంత ఉపాధ్యాయుడు గోరంట్ల లక్ష్మీకాంత్‌రెడ్డి



జాతీయ రక్షణ నిధికి విరాళాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న గోరంట్ల లక్ష్మీకాంతారెడ్డి

గద్వాల న్యూటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండలం కోయిలదిన్నె గ్రామానికి చెందిన రైతు, విశ్రాంత ఉపాధ్యాయుడు గోరంట్ల లక్ష్మీకాంతారెడ్డి జాతీయ రక్షణ నిధికి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. రైతు భరోసా పథకం ద్వారా తన ఖాతాలో జమ అయిన లక్ష రూపాయలను జాతీయ రక్షణ నిధికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు అందించారు. దేశ రక్షణ కోసం సాహసోపేతమైన సేవలను అందిస్తున్న సాయుధ దళాలపై తన గౌరవాన్ని, సేవాభావాన్ని చాటుకున్నారు. ఆయన స్ఫూర్తి అందరికీ ప్రేరణ కావాలని కలెక్టర్ కొనియాడారు.

## గో-గేమ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ




జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి) : బిహార్ రాష్ట్రంలోని ఆరాలో నిర్వహిస్తున్న గో-గేమ్ జాతీయ స్థాయి సబ్‌జూనియర్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. సోమవారం నిర్వహించిన పోటీల్లో జిల్లా యువకులు రాజేశ్, మహ్మద్ బషీరుద్దీన్, మహ్మద్ రియాన్ రాష్ట్ర జట్టు తరుపున బంగారు పతకాలు సాధించారు. వారిని గో-గేమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నస్రూరుల్లా హైదర్, గులాం అఫ్రోజ్, ట్రెజరర్ వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహ్మద్ షకీల్ అభినందించారు.

## గుంతల రోడ్డుపై వరి నాట్లు

» నిరసన తెలిపిన గుడిమల్కాపూర్ గ్రామస్థులు



గుడిమల్కాపూర్ రోడ్డుపై వర్షపు నీటితో నిండిన గుంతలో నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

హన్వాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : గుంతలు పడి అధ్వానంగా మారిన రోడ్డుపై గ్రామస్థులు వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ నుంచి గుడిమాల్కపూర్ గ్రామానికి నాలుగేళ్ల క్రితం బీటీ రోడ్డు మంజూరయ్యింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారు. దీంతో చిన్న వర్షం పడినా రోడ్డుపైనున్న గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో గ్రామస్థులు వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకుడు శ్రీనివాస్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## అయిజలో ఐపీ కలకలం

» రూ. కోటి అప్పులు చేసిన వడ్డీ వ్యాపారి

» 44 మందికి అందిన నోటీసులు

అయిజ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో సోమవారం వడ్డీ వ్యాపారి పంపించిన ఐపీ నోటీసులు కలకలం సృష్టించాయి. దాదాపు కోటి రూపాయలు వడ్డీకి తీసుకొని ఉడాయించిన వ్యాపారి, తీరా వడ్డీకి అప్పులు ఇచ్చిన వారికి నోటీసులు పంపించడంతో లబోదిబో మంటున్నారు. అయిజ పట్టణానికి చెందిన వ్యాపారి తిరుమలేశ్ శెట్టి వ్యాపార అవసరాల కోసం తన వద్దకు వచ్చేవారికి అధిక వడ్డీ ఆశ చూపి కోటి రూపాయల వరకు అప్పులు తీసుకున్నాడు. గత 15 రోజుల నుంచి ఎవరికీ అందుబాటులో లేకుండా పోయాడు. తీరా అతడికి అప్పులిచ్చిన 44 మందికి సోమవారం నోటీసులు పంపించాడు. నోటీసుల్లో పేర్కొన్న మేరకు దాదాపు రూ. 82 లక్షల మేర అప్పులు తీసుకున్నట్లు తెలుస్తుండగా, ఇంకా చాలా మందికి నోటీసులు అందలేదనే ప్రచారం సాగుతోంది.

# 2డే లీగ్‌లో మహబూబ్‌నగర్ జోరు

» తొలి రోజు 255 పరుగుల అధిక్యం

» డబుల్ సెంచరీతో చెలరేగిన డేవిడ్ క్రిపాల్

» సెంచరీ చేసిన షాదాబ్‌అహ్మద్

» 5 వికెట్లు తీసి రాణించిన ముఖిద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్



సెంచరీ సాధించిన షాదాబ్‌అహ్మద్ | 5 వికెట్లు తీసి రాణించిన ముఖిద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంట్రా డి స్ట్రిక్ 2డే అండర్-23 క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ పట్టణ సమీపంలోని తిరుమల హిల్స్‌లోని సమర్థ స్కూల్ మైదానంలో జడ్చర్ల, మహ బూబ్‌నగర్ జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన జడ్చర్ల జట్టు 44 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో సంజయ్ (70) అర్ధసెంచరీ, కేతన్‌కుమార్ 32 పరుగులు చేసి ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో ముఖిద్ 5 వికెట్లు తీసి రాణించాడు. షాదాబ్‌అహ్మద్ 2, శశాంక్, డేవిడ్‌క్రిపాల్, వంశీ ఒక్కో వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు తొలి రోజు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 420 పరుగులు చేసింది. మహబూబ్‌నగర్ జట్టులో డేవిడ్‌క్రిపాల్ 151 బంతుల్లో 16 ఫోర్లు 13 సిక్సలతో డబుల్(210) సెంచరీతో చేలరేగి నాటౌట్‌గా నిలిచాడు. షాదాబ్‌అహ్మద్ 72 బంతుల్లో 7 ఫోర్లు 10 సిక్స్‌లతో సెంచరీ చేయగా, అక్షయ్ 35 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో మహబూబ్‌నగర్ జట్టు 255 పరుగుల అధిక్యం సాధించింది.

### క్రీడాకారులు ప్రతిభ చాటాలి

క్రీడాకారులు టోర్నీలో ప్రతిభ చాటాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో తిరుమలహిల్స్‌లో ని సమర్థ పాఠశాల మైదానంలో జడ్చర్ల, మహబూబ్‌నగర్ జట్ల మధ్య సోమవారం మ్యాచ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఉమ్మడి జిల్లా 2డే లీగ్‌కు నిర్వహణకు అవకాశం కల్పిందన్నారు. టోర్నీలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా జట్టులో స్థానం దక్కుతుందన్నారు. మహబూబ్‌నగర్ జట్టులో డేవిడ్ క్రిపాల్ డబుల్ సెంచరీ, సెంచరీ సాధించిన షాదాబ్‌అహ్మద్‌ను, 5 వికెట్లు తీసి రాణించిన ముఖిద్‌లను అభినందించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు ముక్తర్, ఆబిద్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

## పిల్లలు, తల్లుల సంక్షేమమే లక్ష్యం

- ఆర్ లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్



అచ్చంపేట రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిశు అభివృద్ధి పథకం పిల్లలు, గర్భిణులు, తల్లుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసినదని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్.లక్ష్మి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**ఐసీడీఎస్ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యమేంటి ?**

పిల్లల సమగ్రాభివృద్ధి సాధించడం, మూడేళ్లకు తక్కువ వయసున్న పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడమే లక్ష్యం.

**ప్రాజెక్టు పరిధిలో మీరు ఎన్ని మండలాలకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు?**

అచ్చంపేట కేంద్రంగా చేసుకుని అచ్చంపేట, అమ్రాబాద్, పదర మండలాలు ఐసీడీఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

**మొత్తం ఎన్ని అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అందులో పిల్లల ఆటపాటలకు మీరు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?**

ఎక్కువగా పాఠశాలలకు అనుబంధంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉండడం వల్ల ఆటపాటలకు ఇబ్బంది లేదు. అవుట్‌డోర్ మెటీరియల్ ఉండడం వల్ల పిల్లలు చాలా ఇష్టపడిపోతుంటారు.

**అంగన్‌వాడీ అధికారుల, సిబ్బంది పైన ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటారా?**

తప్పకుండా ప్రజల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో లక్ష్యాన్ని సాధిస్తాం.

న్యూస్ బాక్స్

## గాజరలో ఐదు మేకలు అపహరణ

వంగూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాజర గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వద్ద ఉన్న మేకలను అపహరించుకపోయారు. ఇంటి ఆవరణలో కట్టేసి ఉన్న ఐదు మేకలను గుట్టుగా దుండగులు కొట్టుకెళ్లారు. వాటి విలువ రూ.60 వేల వరకు ఉంటుందని బాధితుడు ఇస్తారయ్య తెలిపారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసి ఉన్న సీసీ కెమెరాల్లో ఈ సంఘటన రికార్డు అయిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఊరిలోనే మేకలు అపహరణకు గురి కావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

## ఆటల్లోనూ రాణించాలి

- ఎంఈవో సత్యనారాయణ శెట్టి




తిమ్మాజిపేటలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

తిమ్మాజీపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి విద్యతో పాటు ఆటల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శెట్టి అన్నారు. ఈనెల 5 నుంచి 19 వరకు కొనసాగిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సమావేశాన్ని మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు విద్య అనుబంధ నైపుణ్యాలు మెరుగుపరచడం కోసం ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం హర్షదాయకమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రాకపోకలకు వాహన ఇబ్బందులు ఎదురైనా ఎండను భరిస్తూ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారని తెలిపారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, అశోక్, ఉపాధ్యాయులు సుధీర్, శ్రీనివాసులు, అరుణ రత్నమాల కార్తీక్, సుధీర్‌గౌడ్, వెంకటేష్ ఉన్నారు.

## రోడ్డు అధ్వానం..

వంగూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉల్లంపల్లి నుంచి వంగూరుకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. మట్టి లగరోడ్డు వర్షాలకు దెబ్బతిని అడుగడుగున గుంతలు ఏర్పడి ప్రమాద భరితంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకయాతన తప్పడం లేదని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. ద్విచక్రవాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు వ్యాపించడంతో ఎదురుగా వస్తున్న వాహనం దగ్గరకు వచ్చేంత వరకు కపించదు. బీటీ రోడ్డు మంజూరు చేయడంలో నేతల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉల్లంపల్లి - వంగూరు రోడ్డులో పెద్ద గుంతలు ఏర్పడి నడవడానికి ఇబ్బందిగా మారిందని స్థానికుడు శ్రీనివాస్ వాపోయారు. 4 కిలోమీటర్లు ప్రయాణించేందుకు నరకయాతన పడుతున్నామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు.

అన్నదాత చూపు..

# ప్రత్యామ్నాయ సాగు వైపు

- వ్యవసాయంలో అధిక ఖర్చులకు తాళలేక ఆందోళన
- పండ్ల తోటలు ఆయిల్‌పామ్, కూరగాయల వైపు మొగ్గుచూపుతున్న రైతులు

పెద్దకొత్తపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో వ్యవసాయం చేస్తున్న అన్నదాతలకు వరి, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, మినుము పంటల సాగులో ఖర్చులు అధికంగా పెరిగాయి. కూలీల కొరత కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. మామిడి, ఆయిల్‌పామ్, బొప్పాయి, నిమ్మ, జామ వంటి తోటలతోపాటు కూరగాయల సాగు వైపు అన్నదాతలు ప్రత్యేక దృష్టి సారించారు. హార్టికల్చర్ అధికారుల లెక్క ప్రకారం మండల పరిధిలోని గంట్రావుపల్లి, కల్వకోల్, ముష్టిపల్లి, తిర్నాంపల్లి, పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, దేవునితిర్మలాపూర్, సాతాపూర్, వెన్నచెర్ల, యాపట్ల తదితర గ్రామాలతో పాటు కోడేరు, పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండలాల్లో 11,772 మంది రైతులు 24,096ఎకరాల్లో మామిడి తోట లను సాగు చేశారు. అదేవిధంగా చంద్రకల్, చెన్నపరావుపల్లి, చిన్నకార్పాముల, దేదినేనిపల్లి, దేవుని తిర్మలాపూర్, గంట్రావుపల్లి, జొన్నలబొ గుడ, కల్వకోల్, కొత్తపేట, మహాసముద్రం, మా రేడుమానుదిన్నె, మరికల్, ముష్టిపల్లి, నక్కలపల్లి, వెన్నచెర్ల, పెద్దకార్పాముల, పెద్దకొత్తపల్లి, యాపట్ల తదితర గ్రామాల్లో 310మంది రైతులు దాదాపు 943ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేశారు. అలాగే పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, దేవునితిర్మలాపూర్, కల్వకోల్, సాతాపూర్, వెన్నచెర్ల, నక్కలపల్లి గ్రామాలల్లో కూరగాయల తోటలు సాగు చేస్తున్నారు. రైతులు కూరగాయల పంటల సాగు చేసి ఎక్కువ మొత్తం లాభాలు ఆర్జిస్తుండడంతో ఇలా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా క్రిమిసంహారక మందుల ఖర్చు రైతు కూలీల ఖర్చులు తగ్గడమే ప్రత్యామ్నాయ పంటలు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. రైతులు ఆధునిక వ్యవసాయ సాగు విధానాలపై స్వస్తి చెబుతూ నూతన వ్యవసాయానికి శ్రీకారం చుడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు సైతం నూతన వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ గ్రామాలల్లో రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



దేవునితిర్మలాపూర్ శివారులో సాగు చేసిన ఆయిల్ పామ్ తోట



పెద్దకొత్తపల్లి శివారులో మామిడి తోట

### పండ్ల తోటలతో అధిక లాభాలు



కొన్నేళ్లుగా మార్కెట్‌లో పండ్లకు మంచి గిరాకీ ఉండడంతో పండ్ల తోటల సాగుపై దృష్టి సారిస్తున్నాం. ప్రస్తుతం ఎకరాల్లో మామిడితోట సాగు చేశాను. ప్రభుత్వ రాయితీలను అందిపుచ్చుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపితే ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ.

- దాదే కుర్మయ్య, రైతు, పెద్దకొత్తపల్లి

### ప్రత్యామ్నాయ పంటల వైపు..



ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయంలో పెట్టుబడుల వ్యయం గణనీయంగా పెరిగింది. దాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, మామిడి తోటల సాగుపై దృష్టి సారించాలి. ఈ దిశగా రైతులు ఆలోచన చేయాలి.

- లక్ష్మణ్, హార్టికల్చర్, కొల్లాపూర్

# సమస్యలు ముఖ్యమంత్రికి చెబుతామంటే అరెస్టు చేస్తారా?

- పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల ముందస్తుగా అరెస్ట్

అచ్చంపేటటౌన్/ అమ్రాబాద్/ తెలకపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లమల పర్యటనకు వస్తున్నందున నియోజకవర్గంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌ని అడ్డుకుంటారన్న సమాచారంతో ఎక్కడికక్కడా బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. అచ్చంపేటలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు బల్మూరి జానకి, రామచంద్రయ్య, బాలాజీ, తేజస్విని, రవి, సాంబయ్యను పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. నల్లమలలో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్దామంటే తమను అరెస్టు చేయడం ఎంత వరకు సమం జసమని అరెస్టయిన బీజేపీ నాయకులు ప్రశ్నించారు.

● అమ్రాబాద్‌లో అరెస్ట్ చేసిన వారిలో బీజే పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షుడు గోలి నాగరాజు, నాయకులు శంకర్‌గౌడ్, ఉప్పల పరమేష్, పరమేష్‌గౌడ్, సాయి. శంకర్‌లు ఉన్నారు. సీఎం నల్లమల ప్రాంతానికి శాశ్వత సాగునీరు ప్రాజెక్టులు ప్రకటించాలని నాగరాజు డిమాండ్ చేశారు.



అచ్చంపేటలో బీజేపీ నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించిన పోలీసులు

### ప్రశ్నించే గొంతుకలను కట్టడి చేసేందుకే అక్రమ అరెస్టులు : స్వేరోస్

తెలకపల్లి, మండల కేంద్రంలో ఉన్న స్వేరోస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ... గురుకులంలో ఒకేషనల్ విద్య కోర్సులను తొలగించడంపై ప్రశ్నిస్తున్నందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం మమ్ములను కట్టడి చేసే ప్రయత్నం చేస్తుందని ఈ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని హెచ్చరించారు. పరమేశ్వర్, బల్మూర్ మల్లేష్‌ను మార్గమధ్యలో అరెస్టు చేశారు.

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం

# ఎంతో స్ఫూర్తిదాయకం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు
- జిల్లా కేంద్రం సుందరయ్య వర్ధంతి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జీవితాంతం ప్రజల కోసం పోరాడిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ చట్టబద్ధ పదవుల్లో ఉన్నప్పటికీ ఆడంబరాలకు పోకుండా సైకిల్‌పైనే పార్లమెంటుకు వెళ్లి ప్రజా సమస్యలపై గళం వినిపించారన్నారు. సుందరయ్య పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామయ్య, అశోక్, శ్రీనివాసులు,యాదయ్య, మల్లికార్జున్, సురేష్ పాల్గొన్నారు.

### సుందరయ్య జీవితం ఆదర్శం

కొల్లాపూర్ : స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం భవిష్యత్ తారాలకు స్ఫూర్తిదాయకమని సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ అన్నారు. సుందరయ్య వర్ధంతిని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తాలో నిర్వహించారు. అగ్రకులంలో పుట్టినప్పటికీ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి దళితుల చేత ఆలయ ప్రవేశాలు చేయించి, సహపంక్తి భోజనాలు నిర్వహించిన ఆదర్శ నేత సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎండీ సలీం, నాయకులు బాలయ్య, సత్తిరెడ్డి, మధు, శ్రీను, నరసింహ, శివశంకర్, శేషయ్య, బాలకృష్ణ, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

### సుందరయ్యకు ఘన నివాళి

కల్వకుర్తి : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకొని కల్వకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు బాల్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పరశురాములు, నాయకులు బి.శ్రీనివాసులు, శ్రీనివాసులు, బాలయ్య, అలివేల, యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, రామాన్జన్, నెహ్రూ ప్రసాద్ పాల్గొన్నారు.

### ఆశయాలను కొనసాగిస్తాం

తాడూరు : భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాట ఉద్యమ సారథి పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న అన్నారు. సోమవారం సుందరయ్య వర్ధంతిని తాడూరు బస్టాండ్ దగ్గర సీపీఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అంతటి కాశన్న నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సీపీఎం శాఖ కార్యదర్శి ఎనుపోతుల కాశన్న, సీపీఎం నాయకులు గడ్డం బంగారయ్య, బాలరాజు, వెంకటేష్, చంద్రయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

### ఘన నివాళి

బల్మూరు : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో సీపీఎం ఆయన చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఎండీ లాల్ మహమ్మద్, బాబర్, కృష్ణయ్య, ఆంజనేయులు, నాగయ్య, మాసయ్య, నారాయణ పాల్గొన్నారు.

# నల్లమల అడవుల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ

కొల్లాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న దట్టమైన నల్లమల అడవుల్లో లభించే ముడి సరుకుల ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ డిమాండ్ చేశారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సోమవారం సీపీఐ కొల్లాపూర్ మండల 18వ మహాసభలు నల్లమల్ల ప్రాంతమైన మొలచింతలపల్లి గ్రామంలో సీపీఐ నాయకులు జంగం శివుడు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. బాలనరసింహ, రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ ఫయాజ్ పాల్గొని మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయని వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో పదవులు ఉన్నా, లేకున్నా కార్మిక, కర్షక, పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసిన ఘనత చరిత్ర ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పరచాలని, ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఇందిరమ్మ, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కురుమయ్య, కిరణ్ కుమార్, బండి లక్ష్మీపతి, మండల సమితి సభ్యులు అమరగిరి స్వామి, లక్ష్మయ్య, నరసింహ, అక్బర్, ప్రజలు పాల్గొన్నారు.



మొలచింతపల్లి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ

# ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

పెంట్లవెల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : మల్లేశ్వరం, వేంకల్ గ్రామాల్లో ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహ యాదవ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయసింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో మల్లేశ్వరం, వేంకల్ గ్రామాలు ఇళ్లు, భూములు, సర్వస్వం కోల్పోయారని వారు పేర్కొన్నారు. వారికి ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు చూపించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భోగ్యం నరసింహ, బాలరాజు, రాముడు, కృష్ణరాజు, శేఖర్, వెంకటస్వామి పాల్గొన్నారు.



తహసీల్దార్ విజయసింహకు వినతి పత్రం అందజేస్తున్న మల్లేశ్వరం గ్రామస్థులు

# మాచారం ఆలయంలో సీఎం పూజలు

- మంత్రులతో కలిసి సీతారామాంజనేయ స్వామిని దర్శించుకున్న రేవంత్‌రెడ్డి

అమ్రాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండల పరిధిలోని సీతారామాంజనేయ ఆలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. బహిరంగ సభలో పాల్గొనే ముందు ఆలయానికి మంత్రులతో కలిసి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు సీఎం రేవంత్ రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలను ఘనంగా సత్కరించారు. ఆలయ ధర్మకర్త జలంధర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాచారంలో సీతారామాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

### నల్లమలలో పోలీసు బలగాల మోహరింపు

సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పర్యటన సందర్భంగా జిల్లా ఎస్పీ అభినవ్ గైక్వాడ్ నేతృత్వంలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఎస్పీలతో పాటు, నలుగురు అదనపు ఎస్పీలు బందోబస్తును పర్యవేక్షించారు. సీఎం బహిరంగ సభ అనంతరం రోడ్డు మార్గంలో కొండారెడ్డిపల్లికి ప్రయాణించడంతో 1300 మంది పోలీసులు రోడ్డు మార్గం మొత్తం తమ అదుపులోకి తీసుకున్నారు. సీఎం కాన్వాయ్‌కు ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం పర్యవేక్షించాయి. బహిరంగ సభస్థలి వద్ద, వీఐపీ, ప్రెస్ గ్యాలరీ వద్ద పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతించారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసు యంత్రాగం ఊపిరి పీల్చుకున్నది.

# భక్తి శ్రద్ధలతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూజలు

ఊర్కొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం వేద పండితులు రాజుశర్మ, దత్తాత్రేయశర్మల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదమంత్రాలతో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, దీపజ్యోతి, ధ్వజస్తంభం, నవగ్రాహాలకు జలధివాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఊర్కొండపేట ఆలయం ఆవరణలో గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

# టీడీపీలో పలువురి చేరిక

కొల్లాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని పూర్వ టీడీపీ నాయకులు, కార్యకర్తలను తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ చైర్మన్ పాలెం సుధాకర్ నాయుడు పేర్కొన్నారు. గతంలో టీడీపీలో చురుకుగా పని చేసిన నాయకులను, కార్యకర్తలను సోమవారం ఆయన కలిసి వారికి పార్టీ కండువా వేసి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో టీడీపీలో చురుకుగా పని చేసిన నాయకులను, కార్యకర్తలను ఐక్యం చేసి రాబోయే స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికల్లో కొల్లాపూర్‌లో టీడీపీ అభ్యర్థుల గెలుపుకై తాను కృషి చేస్తామని తెలిపారు. కొల్లాపూర్‌లో మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంజన్న, బొజ్జన్న నాయుడు, ఆంజనేయులు గౌడ్, చెన్నయ్య, జయశ్రీలకు టీడీపీ కండువాలు కప్పి, పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ తాలూకా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు.



పూర్వ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధాకర్ నాయుడు

# బీజేపీతోనే కొల్లాపూర్ అభివృద్ధి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు

కొల్లాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో బీజేపీతోనే కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు వెల్లడించారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని తాళ్ల నరసింహాపురం గ్రామంలో బీజేపీ జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించారు. గత బీఆర్ఎస్ పాలనలో తాళ్ల నరసింహాపురం గ్రామాన్ని కొల్లాపూర్ మునిసిపాలిటీలో చేర్చడంతో అనేక మంది గ్రామంలో ఉన్న నిరుపేదలు మహిళలు ఉపాధి హామీ పనికి దూరమయ్యారని అన్నారు. గడిచిన రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కొల్లాపూర్ నియోజకవర్గానికి పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆయన విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ, మాజీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికారి ప్రతినిధి శేఖర్ గౌడ్, కార్యకర్తలు రమేష్ యాదవ్, కురుమయ్య, పాండు, స్వామి, చందు పాల్గొన్నారు.



తాళ్ల నరసింహాపురంలో పార్టీ జెండావిష్కరణలో ఎల్లేని సుధాకర్‌రావు

### తిరంగ యాత్రను విజయవంతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి

నాగర్‌కర్నూల్ : ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహించే తిరంగ యాత్రను విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలి రావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వాములైన భారత త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం తెలిపేందుకు, అమరవీర జవానులకు శ్రద్ధాంజలి ఘటించేందుకు దేశవ్యాప్తంగా తిరంగ యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు

కల్వకుర్తి, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మచ్చల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మ ర్ క్యాంపు సోమవారం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఎంపిక చేసిన పాఠశాలల్లో వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించడం ఎంతో మంది విద్యార్థులకు మేలు జరిగిందని ముగింపు సభలో పలువురు పేర్కొన్నారు. క్యాంపులో విద్యార్థిని, విద్యార్థులకు బేసిక్ మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, డ్యాన్స్, స్పోర్ట్స్, కరాటే, పేపర్ క్రాఫ్ట్, కుట్లు, అల్లికలు వంటి వాటిలో శిక్షణ ఇచ్చారని హెచ్ఎం వెంకటరమణ తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాయకులు సంతోష, మల్లేష్, యువకులు యూసుఫ్, బాబా, గణేష్, ఉపాధ్యాయులు నారాయణగౌడ్, మనసూర్, యాదయ్యగౌడ్, పాండు, డ్యాన్స్ మాస్టర్ రాజు, మాధురి, హేమ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులుపాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని సాతాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమ్మర్ క్యాంపు ముగిసింది. సోమవారం పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు సమ్మర్ క్యాంపు ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో కే.శ్రీనివాస్‌రెడ్డి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు 15రోజులుగా నేర్చుకున్న తమ నైపుణ్యతను ముగింపు సందర్భంగా ప్రదర్శించారు. కార్యక్ర మానికి పీఏసీఎస్ చైర్మన్ ఆనంద్, జ్యోతి, వివిధ క్రీడావిభాగాల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీశైలం, సీనియర్ ఉపాధ్యాయురాలు వి.నాగేశ్వరి, బి.లక్ష్మయ్య, సాతాపూర్ ప్రైమరీ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బాలస్వామి, విద్యార్థులకు వివిధ కళల్లో తర్ఫీదు నిచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




కల్వకుర్తి : డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని, విద్యార్థులు